## క్లుప్తంగా

### ప్రభుత్వ కళాశాలలో దరఖాస్తుల స్వీకరణ

అయిజ: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశానికి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు కళాశాల ప్రి న్సిపాల్ కె.రాములు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు కళాశాలలో చేరేందుకు మే 31 వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. జూన్ 1 నుంచి కళాశాలలో తరగతులు ప్రారంభమవుతాయని తెలిపారు. కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, హెచ్ఈసీ గ్రూప్‌లు ఉన్నాయని, విద్యార్థులకు స్కాలర్‌షిప్ వస్తుందని, ప్రభుత్వం ఉచితంగా పాఠ్య పుస్తకాలు అందజేస్తుందని తెలిపారు.

### పత్తి విత్తనాల దుకాణాల్లో తనిఖీ



మానవపాడు: నాణ్యమైన పత్తి విత్తనాలు అందించాలని మండల వ్యవసాయ అధికారి సుబ్బారెడ్డి తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని మనగ్రోమోర్, వివిధ షాపుల్లో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేద, యూఎస్ఏ, 4708, 4753 రకాల పత్తి విత్తనాలు తనిఖీ చేశామన్నారు. ప్రభుత్వం గుర్తింపు పొందిన నాణ్యమైన విత్తనాలను రైతులు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

### శివాలయంలో ప్రత్యేక అభిషేకాలు



ఎర్రవల్లిచౌరస్తా: బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని శివాలయంలో సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు శివునికి వివిధ రకాల అభిషేకాలు చేశారు. చుట్టు పక్కల ప్రాంతాల నుంచి భక్తులు బీచుపల్లికి చేరుకొని భక్తిశ్రద్ధలతో శివాలయాన్ని దర్శించుకున్నారు.

### ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు సురక్షితం

మల్దకల్: ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు సురక్షితమని డాక్టర్ స్వరూపరాణి సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన గర్భిణులు, బాలింతలకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ గర్భిణులు నెలనెలా క్రమం తప్పకుండా వైద్యపరీక్షలు చేయించుకోవడంతో పాటు పోషకాలు ఎక్కువగా ఉండే పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. ముఖ్యంగా ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలకు అందజేస్తున్న పౌష్టికాహారం సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెల్త్‌సూపర్‌వైజర్ శ్రీధర్, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

### అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ బాగుండాలి

మల్దకల్: అంగన్‌వాడీ కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహించాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ బాలమ్మ సూచించారు. సోమవారం మల్దకల్‌లోని అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు ఎత్తు, బరువు తక్కువ ఉన్న చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. పౌష్టికాహారం సక్రమంగా పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

### 'రైతునేస్తం' సద్వినియోగం చేసుకోండి

అయిజ: మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో మంగళవారం వ్యవసాయ శాస్త్రవేత్తలు నిర్వహిస్తున్న రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి శంకర్ లాల్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. మంగళవారం ఉదయం 9 గంటల నుంచి వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతుల సందేహాలను నివృత్తిచేస్తారని, రైతులకు సలహాలు, సూచనలు చేస్తారని తెలిపారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం హైదరాబాద్‌లో నిర్వహించే విత్తన మేళ ప్రాముఖ్యత గురించి తెలుపుతారని, పంటల వ్యర్థాల కాల్చివేత వలన కలిగే దుష్పరిణామాల గురించి వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులకు వివరిస్తున్నట్లు పేర్కొన్నారు.

### ఆర్థికసాయం అందజేత

ఆత్మకూర్: ఇటీవల కురిసిన వర్షానికి కూలిపోయిన ఇంటి మరమ్మతు కోసం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డి ఆర్థిక సాయం అందజేశారు. సోమవారం ఆత్మకూరు మండలంలోని పిన్నంచర్లలో శనివారం కురిసిన వర్షానికి బోయ నరేష్ నివాస గృహం పాక్షికంగా దెబ్బతింది. విషయం తెలుసుకున్న నాయకులు బాధిత కుటుంబానికి వెళ్లి ఇంటి మరమ్మతు కోసం రూ.10 వేలు అందజేశారు.

# పదవి ముగిసినా.. ప్రోత్సాహకం రాలే

- నియోజకవర్గంలో 13 ఏకగ్రీవాలు
- ఐదేళ్లుగా నిధుల కోసం ఎదురుచూపు
- అప్పులు చేసి అభివృద్ధికి పెట్టుబడి
- ఇబ్బందులు పడుతున్న మాజీ సర్పంచులు
- పట్టించుకోని పాలకులు, ప్రభుత్వం




తిమ్మాపురం జీపీలో గ్రామసభను నిర్వహిస్తున్న(ఫైల్)

ఎర్రవల్లిచౌరస్తా: గ్రామ పంచాయతీలను ఎన్నికలు లేకుండా ఏకగ్రీవం చేసుకుంటే ప్రజల్లో ఐకమత్యం పెరిగి గ్రామాభివృద్ధికి తోడ్పాటు అందించడం సులభమవుతుందని ప్రభుత్వాలు భావించాయి. దీని కోసం ఎన్నికలు లేకుండా ఏకగ్రీవమయ్యే పంచాయతీలకు ప్రత్యేక ప్రోత్సాహక నిధులను అందించాలని 2001లో అప్పటి ప్రభుత్వం నిర్ణయించింది. జనాభా ఆధారంగా ఏకగ్రీవ పంచాయతీలకు రూ.7లక్షల వరకు నిధులు గతంలో మంజూరయ్యేవి. కానీ 2019లో టీఆర్ఎస్ ప్రభుత్వం ఈ ఏకగ్రీవ పోత్సాహకాన్ని భారీగా పెంచింది. దీంతో గ్రామాభివృద్ధి కోసం గ్రామస్తులంతా ఏకమై పలు పంచాయతీలకు ఎన్నికలు లేకుండానే ఏకగ్రీవం చేశారు. ఐదేళ్ల పదవీకాలం పూర్తయినా నేటి వరకు పోత్సాహక నిధులు మంజూరు కాకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదని మాజీ సర్పంచులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**సాధారణ నిధులతో పాటు అదనంగా..**

ఏకగ్రీవంగా ఎన్నికైన పంచాయతీలకు సాధారణ పంచాయతీలకు అందించే నిధులతో పాటుగా అదనంగా ప్రోత్సాహక నిధులను అందజేస్తారు. ఈ పథకాన్ని దేశంలో మొదటగా 1960లో రాజస్థాన్ రాష్ట్రంలో ప్రారంభించారు. ప్రస్తుతం తెలంగాణ, హరియాణ, గుజరాత్ రాష్ట్రాల్లో మాత్రమే ఏకగ్రీవమయ్యే పంచాయతీలకు ఈ ప్రోత్సాహక పథకం అమలవుతోంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2001 నుంచి అమలవుతుండగా, 2006 నుంచి జీపీలకు రాయితీలు ఇస్తున్నారు. అనంతరం 2013లో జీఓ నెంబర్ 1274ను తీసుకొచ్చి అనంతరం పలు సవరణలు చేశారు. ప్రత్యేక తెలంగాణ ఏర్పాటయ్యాక అదనంగా కొత్త పంచాయతీలు ఏర్పడటంతో పాటుగా రాష్ట్రంలో కొత్త పంచాయతీ చట్టం కూడా అమలులోకి వచ్చింది. దీని ద్వారా ప్రభుత్వం ఏకగ్రీవ పంచాయతీలకు ప్రోత్సాహక నిధులను పెంచింది. దీంతో పాత పంచాయతీలతో పాటు కొత్తగా ఏర్పడిన పంచాయతీలు సైతం అభివృద్ధిని ఆకాంక్షించి పలు పంచాయతీలను ఏకగ్రీవం చేసుకున్నాయి. ఎన్నికలు జరిగి ఐదేళ్లు పూర్తయినా నేటికీ నిధులు మంజూరు కాలేదు. దీంతో గ్రామాల అభివృద్ధికి అప్పులు చేసిన స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు నిత్యం సమాధానం చెప్పుకోలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.




ఏకగ్రీవమైన పుటాన్‌దొడ్డి గ్రామ పంచాయతీ భవనం

**నియోజకవర్గంలో 13 ఏకగ్రీవ పంచాయతీలు..**

అలంపూర్ నియోజకవర్గంలో 7 మండలాలు, మొత్తం 124 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. అందులో 13 పంచాయతీలు 2019లో ఎన్నికలు లేకుండా ఏకగ్రీవం అయ్యాయి. సర్పంచులతో పాటు వార్డు సభ్యులను కూడా ఏకగ్రీవంగా ఎన్నుకుంటే రూ.15 లక్షల నజరానా ఇస్తామని టీఆర్ఎస్ ప్రభుత్వం సర్పంచ్ ఎన్నికలకు ముందు ప్రకటించింది. దీని ద్వారా నియోజకవర్గంలో ఏకగ్రీవమైన 13 జీపీలకు రూ.1.95 కోట్లను ప్రభుత్వం జమ చేయాల్సి ఉంది. గతంలో 7లక్షలున్న పోత్సాహకాన్ని టీఆర్ఎస్ ప్రభుత్వం 2019 ఎన్నికల సందర్భంగా రూ.10 లక్షలకు పెంచింది. దీనికి అదనంగా ఎమ్మెల్యే నిధుల నుంచి కూడా రూ.5 లక్షలను కలిపి మొత్తం రూ.15 లక్షలు ఇస్తామని ప్రకటించింది. ఎన్నికలు జరిగి ఐదేళ్లు పూర్తవ్వడంతో పాటు వారి పదవీకాలం సైతం ముగిసింది. అయినా నిధులు మంజూరు కాలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఏకగ్రీవ పంచాయతీలకు ప్రోత్సాహకం నిధులు మంజూరు చేసి ఆదుకోవాలని మాజీ సర్పంచులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

**మండలాల వారీగా ఏకగ్రీవ గ్రామ పంచాయతీల వివరాలు**

| మండలం | జీపీలు | ఏకగ్రీవ పంచాయతీలు |
|---|---|---|
| ఇటిక్యాల | 29 | పుటాన్‌దొడ్డి, తిమ్మాపురం, నక్కలపల్లి. |
| మానవపాడు | 16 | కలుకుంట్ల. |
| వడ్డేపల్లి | 10 | తిమ్మాజిపల్లి, వెంకట్రామనగర్ |
| రాజోళి | 11 | పడమటి గార్లపాడు |
| ఉండవెల్లి | 16 | బైరాపురం |
| అలంపూర్ | 14 | ఏకగ్రీవం కాలేదు |
| అయిజ | 28 | కురవపల్లి, గుడిదొడ్డి, కిష్టాపురం, నౌరోజీ క్యాంపు, కొత్తపల్లి. |

**నిధుల కోసం ఎదురుచూస్తున్నాం..**



గ్రామాన్ని అభివృద్ధి చే యాలని ప్రత్యేక ప్రోత్సాహక నిధుల కోసం పంచాయతీని ఎన్నికలు లేకుండానే ఏక గ్రీవం చేసుకున్నాం. కానీ ఎ న్నికైనప్పటి నుంచి గ్రామంలో అదనంగా పలు అభి వృద్ధి పనులు చేపడదామంటే ప్రోత్సాహక ని ధులు ఇప్పటి వరకు మంజూరు కాలేదు. ప్ర జల నుంచి నిత్యం ఇబ్బందులు పడలేక అప్పు లు చేసి అభివృద్ధి పనులను చేపట్టి ప్రభుత్వం నుంచి వచ్చే నిధుల కోసం ఎదురుచూస్తున్నాం. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ప్రోత్సాహక నిధులను వెంటనే మంజూరు చేయాలి.

– స్వాతి, మాజీ సర్పంచ్, పుటాన్‌దొడ్డి

**అప్పులు చేసి రోడ్లు, డ్రైయినేజీలు నిర్మించాం..**



గ్రామాన్ని అభివృద్ధి చేయడం కోసం గ్రామస్తుల సహకారంతో మా పంచాయతీని ఏకగ్రీవంగా చేసుకున్నాం. ప్రోత్సాహకంగా ప్రభుత్వం అందించే రూ.15 లక్షలు వస్తే గ్రామంలో పలు అభివృద్ధి పనులు చేపట్టాలని ఎంతో ఎదురు చూశాం. ప్రజలు పడుతున్న ఇబ్బందులను చూసి అప్పులు చేసి గ్రామంలో సీసీ రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణాలు చేపట్టాం. కానీ నేటి వరకు ప్రభుత్వం నుంచి ప్రోత్సాహక నిధులు మంజూరు కాలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే నిధులను మంజూరు చేసి ఆదుకోవాలి.

– నాగేశ్వరి, మాజీ సర్పంచ్, తిమ్మాపురం

**గతంలోనే ప్రభుత్వానికి నివేదించాం..**



మండలంలో ఏకగ్రీవంగా ఎన్నికైన మూడు పంచాయతీల వివరాలను గతంలోనే ప్రభుత్వానికి నివేదించాం. ప్రభుత్వం నుంచి ప్రోత్సాహక నిధులు ఆయా పంచాయతీలకు మంజూరు కావల్సి ఉంది. ప్రభుత్వం నుంచి ప్రోత్సాహక నిధులు విడుదల కాగానే ఏకగ్రీవంగా ఎన్నికైన గత సర్పంచులకు సమాచారం అందించి, ఆయా ఖాతాలలోకి ప్రోత్సాహక నిధులను జమ చేయిస్తాం.

– భాస్కర్, ఎంపీఓ, ఇటిక్యాల

### నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

అలంపూర్: విద్యుత్ మరమ్మతుల నిమిత్తం మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని అలంపూర్ సబ్ డివిజన్ ఏడీఈ మహ్మద్ చిన్న మక్బుల్‌బాషా ఒక ప్రకటనలో తెలిపారు. 33కేవీ శాంతినగర్ ఫీడర్–2 పరిధిలో విద్యుత్ స్తంభాలు సరి చేయడం, విద్యుత్ లైన్‌లకు తాకే చెట్ల కొమ్మలను తొలగించే పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఉదయం 7గంటల నుంచి 10గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని తెలిపారు. మానవపాడు రైల్వే సబ్ స్టేషన్‌కు కొత్త విద్యుత్ లైన్ ఏర్పాటు చేసే పనులు చేపడుతున్నట్లు తెలిపారు. 11 కేవీ బొంకూరు ఫీడర్ పరిధిలో ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు తెలిపారు.

అయిజ: అయిజ, వడ్డేపల్లి, రాజోళి మండలాల్లోని వివిధ గ్రామాల్లో ఉదయం 7:30 గంటల నుంచి 10:30 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నట్లు ఏడీఈ గోవిందు తెలిపారు. మండలంలోని 33/11 కేవీ వెంకటాపురం సబ్‌స్టేషన్ పరిధిలోని వెంకటాపురం, పర్దీపురం, కిష్టాపురం, కురువపల్లి, యాపదిన్నె, గుడిదొడ్డి గ్రామాలకు, ఉప్పల 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని ఉప్పల, ఉప్పల క్యాంపు గ్రామాల్లో అంతరాయం ఉంటుందని తెలిపారు. వడ్డేపల్లి మండలంలోని తనగల, రాజోళి మండలంలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని మాన్‌దొడ్డి, పెద్ద ధన్వాడ, నసనూరు, పచ్చర్ల గ్రామాలకు విద్యుత్ సరఫరాను 3గంటలు నిలిపేస్తున్నట్లు తెలిపారు. గట్టు మండలంలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని ఆలూరు, తుమ్మల చెరువు, వాయలకుంట, తండా, నల్లగట్టు తండా, బింగిదొడ్డి తండా, పెంచికలపాడులో అంతరాయం ఉంటుంది.

గట్టు: విద్యుత్ మరమ్మతుల కారణంగా అయిజ నుంచి గట్టుకు వచ్చే విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉండనున్నట్లు డీఈ గోవిందు, ఏఈ చెన్నయ్యలు ఒక ప్రకటనలో తెలిపారు. గట్టు, ఆలూరు సబ్‌స్టేషన్ల పరిధిలో గట్టు, సల్కాపురం, తారాపురం, గంగిమాన్‌దొడ్డి, యల్లందొడ్డి, ఆలూరు, తుమ్మల చెరువు, వాయిల్‌కుంట తండా, బింగిదొడ్డి తండా, పెంచికలపాడుకు ఉదయం 7:30 గంటల నుంచి 10:30 గంటల వరకు నిలిపేస్తున్నట్లు తెలిపారు.

మానవపాడు: ట్రాన్స్‌కో వారు రైల్వే సబ్‌స్టేషన్ కొత్త లైన్ల ఏర్పాటు పనులు చేపట్టనున్నట్లు జిల్లా ఏడీఏ సయ్యద్ చిన్న మక్బుల్ ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ మానవపాడు, శ్రీనగర్ గ్రామంలోని సబ్ స్టేషన్ల పరిధిలో ఉదయం 7గంటల నుంచి 10 గంటల వరకు అంతరాయం ఉంటుందని తెలిపారు.

## గర్భిణులకు వైద్య పరీక్షలు



గర్భిణులతో మాట్లాడుతున్న రిజ్వానా తాన్విర్

మానవపాడు: మండలంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో సోమవారం డాక్టర్ రిజ్వాన్ తాన్విర్ ఆధ్వర్యంలో అమరవాయి, మానవపాడు గ్రామాల ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. మానవపాడు, అమరవాయి గ్రామాల్లో 54 మంది గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. రక్తహీనత రాకుండా పోషకాలు ఉన్న ఆహార పదార్థాలు తీసుకోవాలని, ఐరన్ మాత్రలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పంపీహెచ్ఓ ఎసత్యనారాయణ, పీఎచ్ఎన్ హెలెన్, ఎచ్ఎస్ చంద్రన్న, సంధ్యారాణి, ఫార్మాసిస్ట్ తిరుమల్‌రావు, ఏఎన్ఎమ్‌లు మాబమ్మ, దేవమ్మ, సోని, సిబ్బంది పాల్గొన్నారు.

## యువకుల రక్తదానం



రక్తదానం చేసిన యువకులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న డాక్టర్ కిషోర్‌కుమార్

గద్వాల న్యూటౌన్: సినీ హీరో ఎన్టీఆర్ జన్మదిన వేడుకల సందర్భంగా అభిమానులు సోమవారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. జిల్లా ఎన్టీఆర్ ఫ్యాన్స్ అసోసియేషన్ సభ్యులు ఎన్టీఆర్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చిరుమురిరాజ్ ఆధ్వర్యంలో జమ్ములమ్మ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లా ఆస్పత్రిలో రోగుల సహాయకులు 200 మందికి అన్నదానం చేశారు. రోగులకు బ్రెడ్లు, వాటర్ బాటిల్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిషోర్‌కుమార్, వైద్యులు శ్యామ్, ప్రదీప్, అసోసియేషన్ ఉపాధ్యక్షుడు శ్రీధర్, వీరేష్, సుబాన్, కృష్ణారెడ్డి, రమేష్ పాల్గొన్నారు.

## రైతుల సమస్యలను పరిష్కరించాలి



మల్దకల్‌లో మాట్లాడుతున్న వెంకటయ్య

మల్దకల్: రైతుల భూ సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ వ్యవసాయ వృత్తిదారుల యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మల్దకల్ రైతు వేదికలో రైతులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటయ్య మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న రైతుల భూ సమస్యలను పరిష్కరించడంతో పాటు భూ సర్వే చేయాలని ఆయన కోరారు. కూలీలకు వేతనాలు పెంచాలన్నారు. రైతులకు పెట్టుబడి సాయం అందించాలని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ వృత్తిదారుల యూనియన్ నాయకులు నర్సింహులు, నాగన్న, వెంకటేశ్వరమ్మ, శ్రీనివాసులు, స్వాతి, వెంకటేశ్వర్లు, రైతులు ఉన్నారు.

## గుంతలమయంగా గట్టు రోడ్డు



ధరూరు–బూరెడ్డిపల్లి గ్రామాల మధ్య బీటీ రోడ్డు

ధరూరు: ధరూరు–గట్టు వెళ్లే రోడ్డు గుంతలమయంగా తయారైంది. ధరూరు నుంచి మార్లబీడు, ర్యాలంపాడు గ్రామాలకు వెళ్లే వారు ఈ మార్గం గుండా వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అడుగడుగునా గుంతలు ఉండడంతో వాహనదారులకు ఇక్కట్లు తప్పడం లేదు. దాదాపు 7కి.మీ. మేర రోడ్డు గుంతల మయంగా మారింది. దీంతో తరచు వహనదారులు ప్రమాదాల భారిన పడుతున్నారు. మరమ్మతులు చేయాల్సిన ఆర్అండ్‌బీ శాఖ అధికారులు నిధుల లేవంటూ కాలయాపన చేస్తూ వస్తున్నారు. ధరూరు నుంచి మార్లబీడు సమీపంలోని ర్యాలంపాడు రిజర్వాయర్ వరకు రోడ్డు మరమ్మతులు చేయాలని రెండు మండలాల ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

## విజేతలకు బహుమతుల ప్రదానం



విజేతలకు బహుమతి ప్రదానం చేస్తున్న దాతలు

శాంతినగర్: వడ్డేపల్లి పురపాలిక పరిధిలోని పైపాడులో నిర్వహించిన కబడ్డీ విజేతలకు సోమవారం సాయంత్రం బహుమతులు ప్రదానం చేశారు. పైపాడులో పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వాముల వారి వార్షిక ఉత్సవాల్లో భాగంగా కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రథమ బహుమతి శాంతినగర్ జట్టు, ద్వితీయ బహుమతి ప్యాపిలి, తృతీయ బహుమతి పంచలింగాల జట్లు కైవసం చేసుకున్నాయి. మొదటి బహుమతి వడ్డేపల్లి మాజీ జెడ్పీటీసీ రూ.30,016 వేలు, రెండో బహుమతి చరణ్ రూ.20,016 వేలు, మూడో బహుమతి ఆర్.భీమిరెడ్డి రూ.10,016 నగదు అందజేశారు. పరుగుపందెం పోటీల్లో విజేతలైన వినోద్, విజయ్‌లకు బహుమతుల ప్రదానం చేశారు.

### ఎల్ఓసీ అందజేత



గద్వాల రూరల్: పేదలకు మెరుగైన వైద్యం కోసం ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం గట్టు మండలం బోయలగూడెం గ్రామానికి చెందిన చిన్నాన్నకు మెరుగైన వైద్యం కోసం సీఎం సహాయనిధి కింద రూ.1.10లక్షలు ఎల్ఓసీ అందజేశారు.

### ఉత్సవాలను ఘనంగా నిర్వహిద్దాం

అయిజ: పట్టణంలో జూన్ 1న హనుమాన్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహిద్దామని హిందు ధర్మ పరిరక్షణ సమితి సభ్యులు పిలుపునిచ్చారు. హనుమాన్ జయంతి ఉత్సవాలకు సంబంధించి మంగళవారం పట్టణంలోని అంబ భవాని ఆలయంలో ఉదయం 10 గంటలకు ముఖ్య సభ్యుల సమావేశం నిర్వహిస్తున్నట్లు హిందు ధర్మ పరిరక్షణ సమితి సభ్యులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో హనుమాన్ జయంతి ఉత్సవాలను నిర్వహించే కార్యాచరణను రూపొందించనున్నట్లు తెలిపారు. దీనికి సంబంధించి సభ్యులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హిందు ధర్మ పరిరక్షణ సమితి సభ్యులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

### జోరుగా శానిటేషన్ పనులు



శాంతినగర్: వడ్డేపల్లి పుర పరిధిలోని 3వ వార్డులో శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా సోమవారం డ్రెయినేజీలు శుభ్రం చేసే పనులు చేపట్టారు. జేసీబీ సాయంతో డ్రెయినేజీల్లో పేరుకుపోయిన షిల్టు తొలగించే కార్యక్రమం చేపట్టారు. వెంకటనారాయణ ఇంటి నుంచి లంకబాబు వెల్డింగ్ వర్క్‌షాపు వరకు డ్రెయినేజీ కాల్వలు శుభ్రపరిచారు. వర్షపు నీరు, మురుగు నిల్వ ఉండకుండా ముందస్తు చర్యలు చేపట్టినట్లు మున్సిపల్ సిబ్బంది పేర్కొన్నారు.

### అప్పాయిపల్లి వాసికి డాక్టరేట్

పెబ్బేరు రూరల్: వనపర్తి మండలంలోని అప్పాయిపల్లికి చెందిన వంగూరు నాగరాజు రాజనీతి శాస్త్రం విభాగంలో డాక్టరేట్ పొందాడు. పెబ్బేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాజనీతి శాస్త్ర అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా నాగరాజు విధులు నిర్వహిస్తున్నాడు. ఉస్మానియా విశ్వవిద్యాలయం వైస్‌ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ రవీందర్ పర్యవేక్షణలో వాటర్ రిసోర్స్ మేనేజ్‌మెంట్ అండ్ అగ్రికల్చర్ డెవలప్‌మెంట్ ఏ కేస్ స్టడీ ఆఫ్ మిషన్ కాకతీయ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి డాక్టరేట్ వచ్చినట్లు నాగరాజు తెలిపారు. అతడిని పలువురు అధ్యాపకులు, గ్రామస్తులు అభినందించారు.

## 'ఆరు గ్యారంటీల పేరుతో మోసం చేసింది'



చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఆకెపోగు రాంబాబు

శాంతినగర్: ఆరు గ్యారంటీల హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు వాటిని అమలు చేయకుండా ప్రజలను నమ్మించి మోసం చేసిందని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు ఆకెపోగు రాంబాబు అన్నారు. వడ్డేపల్లి పుర పరిధిలోని శాంతినగర్‌లో సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ముందుగా ఐలమ్మ చౌరస్తాలోని చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆరు గ్యారంటీ స్కీంలలో మహాలక్ష్మి పథకం కూడా ఒకటని, దానిని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి మహాలక్ష్మి పథకం అమలు చేసి మహిళలకు చేయూత అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులతో పాటు హమాలీ కార్మికులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో అభివృద్ధి పనుల పరిశీలన



చెన్నిపాడులో సెగ్రిగేషన్‌షెడ్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీఓ ఆంజనేయరెడ్డి

మానవపాడు: మండలంలోని చెన్నిపాడు, మానవపాడు గ్రామాలలో సోమవారం ఎంపీడీఓ ఆంజనేయరెడ్డి అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సరీలోని మొక్కలకు నీటి సదుపాయం మొక్కలకు అందించాలని సూచించారు. వైకుంఠదామం, సెగ్రిగేషన్‌షెడ్, నర్సరీలలో పనులను వేగవంతం చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఎరువులను తయారీ చేయాలని తెలిపారు. నర్సరీలకు తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో కార్యదర్శులు పాల్గొన్నారు.

## డ్రెయినేజీ నిర్మాణానికి కృషి చేస్తాం



డ్రెయినేజీ పరిశీలిస్తున్న ఎంపీడీఓ అబ్దుల్ జబ్బార్

అలంపూర్: డ్రెయినేజీ నిర్మాణానికి కృషి చేస్తామని ఉండవెల్లి ఎంపీడీఓ అబ్దుల్ జబ్బార్ అన్నారు. అలంపూర్ చౌరస్తాలోని పారిశుద్ధ్య పనులను ఎంపీడీఓ, ఎంపీఓ పద్మావతితో కలిసి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అలంపూర్ ప్రధాన రోడ్డు మార్గంలో నిలిచిన వర్షపు నీటి నిల్వలను పరిశీలించారు. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు పక్కల నిలిచిన నీటి నిల్వల గురించి ఆరా తీశారు. డ్రెయినేజీ లేకపోవడంతో వర్షపునీరు వెళ్లడానికి మార్గం లేదని స్థానికులు తెలిపారు. వర్షపు నీరు వెళ్లడానికి ప్రస్తుతానికి తాత్కాలిక పనులు చేపడతామని పేర్కొన్నారు. తర్వాత శాశ్వత పనులు చేపడతామన్నారు. ప్రధాన కూడళిలో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ కుమార్‌రెడ్డికి సూచించారు.

## నర్సరీలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి



పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ రమేష్

రాజోళి: గ్రామాల్లో నర్సరీలపై గ్రామ పంచాయతీ సెక్రటరీలు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎంపీడీఓ రమేష్ అన్నారు. సోమవారం మండలంలోని తూర్పు గార్లపాడులో ఆయన నర్సరీని పరిశీలించి అనంతరం రాజోళి మండల కేంద్రంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. 2022–23 కు సంబంధించిన నర్సరీల వివరాలపై చర్చించి, రా నున్న రోజుల్లో నర్సరీల్లో చేపట్టాల్సిన పనులపై మాట్లాడారు. నర్సరీల్లో ఉన్న సిబ్బంది చేయాల్సిన విధులపై పర్యవేక్షణ ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీఓ ఖాజా మొయినుద్దీన్, కార్యదర్శులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ బస్సు పునరుద్ధరించండి

మదనాపురం: మండలంలోని దుప్పల్లి, కొత్తపల్లి మీదుగా ఆత్మకూరు వెళ్లే షాద్‌నగర్ డిపో ఎక్స్‌ప్రెస్ బస్సును అధికారులు రద్దు చేయడం వల్ల హైదరాబాద్ వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రతిరోజు మధ్యాహ్నం వేళల్లో హైదరాబాద్ వెళ్లేందుకు ప్రయాణికులు నానాతంటాలు పడుతున్నారు. గతంలో కొన్నేళ్ల తరబడి ఈ రూట్‌లో నడిచిన ఈ బస్సు అర్థాంతరంగా అధికారులు రద్దు చేయడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి రద్దయిన బస్సును వెంటనే పునరుద్దరించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.